క్లుప్తంగా

భూసార పరీక్షపై అవగాహన



ఈపూరు: మండలంలోని కొండ్రముట్ల రైతు భరోసా కేంద్రంలోని వ్యవసాయ సిబ్బందికి మండల వ్యవసాయ శాఖ అధికారి రామినేని రామారావు ఆధ్వర్యంలో భూసార పరీక్ష, వ్యవసాయ యాంత్రీకరణకు సంబంధించి బుధవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఏవో మాట్లాడుతూ ఖరీఫ్ 2023కు సంబంధించి అన్ని రైతుభరోసా కేంద్రాల పరిధిలో భూసార పరీక్షలు చేసేందుకు ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేశారని, గ్రామస్థాయిలోని సిబ్బంది ముఖ్యపాత్ర పోషిస్తారని, వారికి సాంకేతిక పరమైన విషయాలు, మట్టి నమూనా తీయు విధానాలు, పరీక్షకు పంపించే మట్టి నమూనాలకు ఎటువంటి సమాచారం పొందుపరచు వివరాల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి బి.అప్పారావు, అన్ని గ్రామాల వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యే బొల్లాపై ఆరోపణలు అవాస్తవం

వినుకొండ(నూజెండ్ల): స్థానిక ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడుపై చేసిన ఆరోపణల్లో వాస్తవం లేదని, ఎమ్మెల్యేకు క్షమాపణలు తెలుపుతున్నట్లు బొల్లాపల్లి మండలం చక్రాయపాలెం గ్రామానికి చెందిన మూడావత్ కోటానాయక్ బుధవారం తెలిపారు. చక్రాయపాలెంలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఇటీవల ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మ నాయుడుకు వ్యతిరేకంగా జరిగిన అసమ్మతి సమావేశంలో షిఫ్ట్ ఆపరేటర్ పోస్టుకు ఎమ్మెల్యే లంచం తీసుకొని వేరే ప్రాంతం వారికి ఉద్యోగం ఇచ్చారని ఆరోపణలు చేసినట్లు తెలిపారు. ఆరోపణల్లో వాస్తవం లేదని, షిఫ్ట్ ఆపరేటర్‌గా ఉద్యోగం పొందిన వ్యక్తి చక్రాయపాలెం గ్రామానికి చెందిన వ్యక్తిగా చెప్పారు. తాను చేసిన వ్యాఖ్యలు వెనక్కి తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యేకు క్షమాపణలు తెలుపుతున్నాని అన్నారు.

భూసార పరీక్షలు చేయించుకోవాలి

చిలకలూరిపేటటౌన్: మట్టి నమూనాల సేకరణ ఆధారంగా రైతులు పంటలను ఎంచుకోవాలని పల్నాడు జిల్లా వ్యవసాయాధికారి ఐ.మురళి చెప్పారు. బుధవారం మండలంలోని గొట్టిపాడు గ్రామంలో మట్టి నమూనాల సేకరణపై వ్యవసాయ, ఉద్యాన సహాయకులకు గ్రామంలోని ఆర్‌బీకేలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏడీఈ మస్తానమ్మ, జిల్లా వ్యవసాయ కార్యాలయ అధికారి ఎం.ధనలక్ష్మి, మండల వ్యవసాయాధికారి టి.శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

యోగాతో రుగ్మతలు మాయం

రొంపిచర్ల: యోగా వలన శరీర మానసిక సంబంధ రుగ్మతుల నుంచి విముక్తి పొందవచ్చని వి.రెడ్డిపాలెం వైద్యాధికారి డాక్టర్ వి.రేవతిబాయి అన్నారు. మర్రిచెట్టుపాలెం గ్రామంలోని పాఠశాలల్లో బుధవారం ఆరోగ్యమేళ నిర్వహించారు. కార్యక్రమంలో ఆరోగ్య విసరణాధికారి పి. శ్రీనివాసరావు, పి.హెచ్.ఎన్. ఎం.సుజాత కుమారి, ఎంఎల్‌హెచ్‌పీలు ఎం.వెంకట్రావు, జ్యోత్స్న, శిరీష, మహాలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పేదలకు వైద్యం అందించటమే లక్ష్యం

రొంపిచర్ల: మండలంలోని బుచ్చిపాపన్న పాలెం గ్రామానికి చెందిన గుడిపాటి అఖిలాష్ సాయిరెడ్డికి నీట్ పరీక్షలో ఆల్‌ఇండియా స్థాయిలో 1576వ ర్యాంక్ సాధించాడు. నీట్ పరీక్ష 720 మార్కులకు నిర్వహించగా 680 మార్కులు సాధించాడు. అలాగే 125వ క్యాటగిరీ ర్యాంకు సాధించాడు. ఎంసెట్ పరీక్షల్లో కూడా 155వ ర్యాంకు సాధించాడు. అయితే వైద్య విద్యను అభ్యసించి పేదలకు వైద్యం అందించటమే తమ లక్ష్యమన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

చిలకలూరిపేటటౌన్: రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందిన సంఘటన బుధవారం వెలుగు చూసింది. పట్టణంలోని మద్దినగర్‌కు చెందిన షేక్ హుస్సేన్‌బీ (50) ఈ నెల 11వ తేదీ తన చిన్న మస్తాన్‌వలితో కలసి ద్విచక్ర వాహనంపై నరసరావుపేటలోని తన సోదరి ఇంటికి వెళ్లి తిరుగు ప్రయాణమయ్యారు. ఈ క్రమంలో మండలంలోని లింగంగుంట్ల గ్రామం వద్దకు చేరుకునే సరికి బైక్ అదుపు తప్పి కింద పడిపోయారు. ప్రమాదంలో హుస్సేన్‌బీ తలకు తీవ్ర గాయమైంది. స్థానికులు గాయపడిన ఆమెను పట్టణంలోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స గుంటూరు జీజీహెచ్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందింది. మృతురాలి పెద్ద కుమారుడు షేక్ జిలానిబాష ఇచ్చిన ఫిర్యాదు మేరకు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అన్ని వర్గాల సంక్షేమమే ముఖ్యమంత్రి లక్ష్యం

వైద్యారోగ్య శాఖ మంత్రి విడదల రజిని


సంకురాత్రిపాడులో ప్రజలతో మాట్లాడుతున్న మంత్రి విడదల రజిని

నాదెండ్ల: అన్ని వర్గాల ప్రజల సంక్షేమం, అభివృద్ధే ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని చెప్పారు. నాదెండ్ల మండలం సంకురాత్రిపాడు గ్రామంలో బుధవారం రెండోరోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ముందుగా గ్రామస్తులు ఆమెకు ఘన స్వాగతం పలికారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలు అమలవుతున్న తీరును ప్రజలతో మమేకమై తెలుసుకున్నారు. వృద్ధులు, మహిళలు, చిన్నారులు, విద్యార్థులు, యువతను పలకరిస్తూ ప్రభుత్వ పనితీరుపై వారి అభిప్రాయాలు తెలుసుకుంటూ, ప్రభుత్వ పథకాలను వివరిస్తూ కార్యక్రమాన్ని సాగించారు. గడప గడపకు వెళ్లి ప్రజలను కలిసి మాట్లాడారు. రాష్ట్ర చరిత్రలో కనీవినీ రీతిలో సంక్షేమ పథకాలు అమలౌతున్నాయన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను, అధికారంలోకి వచ్చిన మరుక్షణం నుంచి అమలు చేసి చూపించిన ఘనత ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డికి దక్కుతుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ జెట్టి నాగమణి, ఉపసర్పంచ్ గంటా వెంకటేశ్వరరెడ్డి, ఎంపీపీ తలతోటి రాణి, మండల ఉపాధ్యక్షురాలు పత్తి సీతామహాలక్ష్మి, జెడ్పీటీసీ కాట్రగడ్డ మస్తాన్‌రావు, మార్కెట్‌యార్డు చైర్మన్ తోట రాజేంద్రప్రసాద్, గణపవరం, నాదెండ్ల సొసైటీల చైర్మన్లు మంగు ఏడుకొండలు, కురుకుంట్ల వెంకటరెడ్డి, వైసీపీ నాయకులు మద్దూరి కోటిరెడ్డి, జెట్టి బొల్లయ్య, కట్టెబోయిన వీరాస్వామి, బత్తుల చినవెంకటేశ్వర్లు, గ్రామ పార్టీ అధ్యక్షుడు క్రీస్తు రాజు, కొసన వీరాంజనేయులు, దాట్ల విక్రమ్‌రాజు, కొసన శివ, కొసన శ్రీను, పోతురాజు శ్రీనివాసరావు, కట్టెబోయిన కోటేశ్వరరావు, ఆరేటి పాపారావు, మేడిశెట్టి శ్రీను, ఇక్కుర్తి శ్రీను, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే అభివృద్ధి సాధ్యం

- ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి
- విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లు పంపిణీ


విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట రూరల్: విద్య ద్వారానే అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి తెలిపారు. లింగంగుంట్లలోని శంకరభారతీపురం జెడ్పీ హైస్కూల్‌లో బుధవారం జగనన్న విద్యాకానుక కిట్‌లను విద్యార్థులకు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి విద్యార్థులకు విద్యా కానుక కిట్లు అందజేసి మాట్లాడారు. రాష్ట్రంలోని 40 లక్షల మంది విద్యార్థులకు రూ.1020 కోట్ల ఖర్చుతో జగనన్న విద్యాకానుక కిట్లను అందజేస్తున్నట్టు తెలిపారు. నూతన విద్యా సంవత్సరంలో పాఠశాల ప్రారంభమైన రోజే విద్యార్థులకు కిట్లను అందజేయడం ఒక చరిత్ర అన్నారు. గతంలో జూన్‌లో పాఠశాలలు ప్రారంభమైతే అక్టోబర్, నవంబర్ నెల వరకు కూడా పాఠశాలలకు ప్రభుత్వం నుంచి అందేవి కాదన్నారు. ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్ రెడ్డి ప్రత్యేక శ్రద్ధతో బ్యాగ్, షూస్, యూనిఫాం, డిక్షనరీ, పాఠ్య పుస్తకాలతో కూడిన కిట్‌లను పాఠశాల ప్రారంభమైన రోజే విద్యార్థులకు పంపిణీ చేస్తున్నారని తెలిపారు. విద్యపై మక్కువతో సీఎం జగన్ ప్రణాళిక బద్ధంగా పని చేస్తున్నారని తెలిపారు. ఒక్కో జగనన్న విద్యా కానుక కిట్ కోసం రూ.2500లు రాష్ట్ర ప్రభుత్వం ఖర్చు చేస్తుందన్నారు. మహానేత డాక్టర్ వై.ఎస్. రాజశేఖరరెడ్డి ఫీజు రీఎంబర్స్‌మెంట్ ద్వారా పేద విద్యార్థులకు ఉన్నత విద్యావకాశాలు కల్పించారని గుర్తుచేసారు. నేడు సీఎం జగన్ నాడు-నేడు ద్వారా పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు రూ.11 వేల కోట్లు, అమ్మఒడి పథకంలో మూడు విడతల్లో రూ.19 వేల కోట్లు తల్లుల ఖాతాల్లో జమ చేసినట్టు తెలిపారు. ఇప్పటి వరకు దాదాపు రూ.60 వేల కోట్లు విద్యకోసం రాష్ట్ర ప్రభుత్వం ఖర్చు చేసిందన్నారు. దీని ఫలితాలు ఇప్పుడే కనిపించకపోయినా భవిష్యత్ తరాలు వీటి ఫలాలు అందుకుంటాయని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి కె.శామ్యూల్, జెడ్పీటీసీ పదముత్తం చిట్టిబాబు, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ ఖాజావలి, ఇఎం స్వామి, ఎంఈవో జ్యోతికిరణ్, పాఠశాల ప్రధానోపాధ్యాయినీ ఎం.పార్వతి, మాజీ సర్పంచ్ పొన్నపాటి విజయకృష్ణారెడ్డి, కామిరెడ్డి నర్సిరెడ్డి, కామిరెడ్డి నాగిరెడ్డి, విద్యా కమిటీ చైర్మన్ పొన్నపాటి కాశిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్వమిత్వా యోజన పథకంతో గ్రామాల అభివృద్ధి

- మర్రిపాలెంలో గ్రామసభ
- రీసర్వే తుది జాబితా ప్రకటన వెల్లడి
- త్వరలో స్వమిత్వా ప్రాపర్టీ కార్డు జారీ


మర్రిపాలెంలో స్వమిత్వా గ్రామసభలో పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు

యడ్లపాడు: స్వమిత్వా యోజన పథకంలో గ్రామాలు సర్వతోముఖాభివృద్ధి చెందుతాయని జిల్లా పంచాయతీ అధికారి కె.భాస్కర్‌రెడ్డి చెప్పారు. మండలంలోని మర్రిపాలెం గ్రామంలో రెవెన్యూ, సర్వే, మండల పరిషత్ విభాగాల ఆధ్వర్యంలో బుధవారం గ్రామసభను నిర్వహించారు. వైఎస్సార్ జగనన్న భూ హక్కు- భూ రక్ష కార్యక్రమంలో భాగంగా గ్రామకంఠం నివాసాలపై నిర్వహించిన రీసర్వే వివరాలను గ్రామస్తుల మధ్య చదివి వినిపించారు. గ్రామంలోని నివసాలు, ఖాళీ స్థలాలు, ప్రభుత్వ స్థలాలైన రోడ్లు, కాల్వలు, ఇతర కార్యాలయాలు వంటి వాటి వివరాలను తెలియజేస్తూ జాబితాను ప్రకటించారు. ఇందుకు సంబంధించి అభ్యంతరాలు ఉంటే తెలియపరచాలంటూ గ్రామస్తులకు గతంలో 13 నోటిఫికేషన్లు అధికారులు పంపిణీ చేశారు. వీటిపై ఎలాంటి అభ్యంతరాలు రాలేదంటూ అధికారులు వెల్లడించారు. గ్రామ పరిధిలో మొత్తం పీపీఆర్ (ప్రాపర్టీ పార్శెల్ నంబర్ మ్యాప్) 225 ఉన్నాయన్నారు. వీటిలో ప్రైవేటు వ్యక్తులకు చెందిన నివాసాలు, ఖాళీస్థలాలు 180 ఉన్నాయని, రోడ్లు, కాల్వలు, ప్రభుత్వ భవనాల వంటివి 45 ఉన్నట్లు నిర్ధారించినట్లు సభలో చదివి వినిపించారు. అన్ని సక్రమంగా ఉన్నాయంటూ గ్రామస్తులు అంగీకరించారని, తుది నివేదిక ఆర్‌ఓఆర్ (జేకే6)ను ఉన్నతాధికారులకు సమర్పించనున్నట్లు తెలిపారు. త్వరలోనే అన్ని నివాసాలు, ఖాళీస్థలాలకు సంబంధించి స్వమిత్వా ప్రాపర్టీకార్డులు వస్తాయన్నారు. సరైన డాక్యుమెంట్లు లేని కారణంగా తమ సొంతిళ్లపై బ్యాంకుల్లో ఆర్థిక లావాదేవీలు జరపలేకపోతున్న వారికి ఈ కార్డులతో ఆ సమస్యను తీర్చాలన్నదే ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమన్నారు. కాబట్టి పథకాన్ని ప్రభుత్వం ఎంతో పటిష్టంగా అమలు చేస్తున్న విషయాన్ని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ దంటూ సరళ, ఎంపీటీసీలు సొసైటీ చైర్మన్ పూర్ణయ్య, స్వమిత్వా పల్నాడు జిల్లా నోడల్ అధికారి కె.గిరిధర్‌రావు, డిప్యూటీ తహసీల్దార్ శ్యామలత, ఈవోపీఆర్‌డీ బృందావనం వరూధిని, గ్రామస్తులు పాల్గొన్నారు.

మట్టి పరీక్షలు చేసిన పంటల్లో ఫలితాలెక్కువ



యడ్లపాడు: ఖరీఫ్ సీజన్‌లో మట్టి పరీక్షల ఆధారంగా పంటల్ని ఎంపిక చేసి సాగుకు ఉపక్రమిస్తే సాగు రైతులకు మంచి దిగుబడులు వస్తాయని మండల వ్యవసాయ అధికారి సీహెచ్ సరిత చెప్పారు. మండల కేంద్రమైన యడ్లపాడు -1 రైతు భరోసా కేంద్రంలో బుధవారం గ్రామ వ్యవసాయ, ఉద్యాన సహాయకులకు మట్టినమూనాల సేకరణపై అవగాహన కల్పించారు. మట్టి పరీక్షల సమాచారం అందించేందుకు ప్రత్యేకించి రూపొందించిన ఎస్‌హెచ్‌సీ (సాయిల్ హెల్త్ కార్డ్)ను ఉపయోగించాలన్నారు. ఈ యాప్‌లో రైతు ఫోన్ నంబర్ అనుసంధానం చేసి ముందుగానే రిజిస్ట్రేషన్ చేయాలని సూచించారు. అనంతరం పొలం వద్దకు వెళ్లి ఎకరం విస్తీర్ణంలో 'వి' ఆకారంలో 8 నుంచి 10 గుంటల్ని తీసి వాటిలో పక్కపొరల్లోని మట్టిని సేకరించాలన్నారు. వీటిని చతురస్ర ఆకారంలో పరిచి నాలుగు భాగాలుగా విభజించి అందులో ఎదురెదురుగా ఉన్న రెండింటిలోని మట్టిని మాత్రమే సేకరించాలన్నారు. ఇలా 500 గ్రాముల మట్టిని తీసుకుని వాటిని జిల్లా కేంద్రంలోని నరసరావుపేట ల్యాబ్‌కు పంపించడం జరుగుతుందన్నారు. పదిరోజుల్లోగా పరీక్షా ఫలితా వివరాలు సదరు రైతు యాప్‌లో నమోదు చేసిన సెల్‌కు సమాచారం వస్తుందన్నారు. మండలంలోని రైతులందరూ మట్టి పరీక్షల సేవలను గ్రామ ఆర్‌బీకేల్లోని సహాయకుల ద్వారా పొందాలని తెలిపారు. అనంతరం క్షేత్రస్థాయిలో సహాయకులను తీసుకెళ్లి మట్టి నమూనాల సేకరణ విధానం చేసి చూపించారు.

వారు ఈకేవైసీలు చేయించాలి...

పీఎం కిసాన్ 13వ విడత నగదు అర్హత జాబితాలో ఉండి ఈకేవైసీ చేయించుకోని మండలం పరిధిలో రైతులు 529 మంది ఉన్నారని తెలిపారు. వీరంతా వెంటనే తమ గ్రామంలోని ఆర్‌బీకేలకు వెళ్లి ఈకేవైసీ చేయించుకోవాలన్నారు.

విజయసాయి నర్సింగ్‌హోం ప్రారంభం

- రిబ్బన్ కట్‌చేసి ప్రారంభించిన ఎమ్మెల్యే గోపిరెడ్డి
- హాజరైన పలువురు డాక్టర్లు


రిబ్బన్ కట్‌చేసి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి, డాక్టర్ శేషిరెడ్డి, రూప

నరసరావుపేట: డాక్టర్ ఓరుగంటి శేషిరెడ్డి, డాక్టర్ ఓరుగంటి రూప ఆధ్వర్యంలో పల్నాడు రోడ్డులో నిర్మించిన నూతన విజయసాయి నర్సింగ్‌హోమ్ భవనాన్ని బుధవారం ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి రిబ్బన్ కట్‌చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కేంద్రమైన నరసరావుపేట పట్టణంలో డాక్టర్ శేషిరెడ్డి, రూప దంపతులు చిన్న పిల్లల వైద్య సేవలు, కంటి వైద్య సేవలకు అధునాతన వసతులతో హాస్పిటల్ ఏర్పాటు చేయటం అభినందనీయమన్నారు. ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించి మంచి పేరు, ప్రఖ్యాతలు గడించాలని డాక్టర్లుకు సూచించారు. కార్యక్రమంలో డాక్టర్లు గజ్జల బ్రహ్మరెడ్డి, ఏఎవీ రామలింగారెడ్డి, కారసాని శ్రీనివాసరెడ్డి, కామిరెడ్డీ శ్రీనివాస రెడ్డి, సూర ప్రదీప్‌కుమార్ రెడ్డి, ప్రత్యూష, కేజే మోహన్‌రెడ్డి, వినోద్ కుమార్‌రెడ్డి, కె.యజ్ఞనారాయణ రెడ్డి, శిరీష, శనివారపు హనిమిరెడ్డి, పాలూరి శ్రీనివాసరెడ్డి, ఇంజినీర్ కొమ్మసాని కమలాకర్ రెడ్డి, పట్టణ ప్రముఖులు, వైఎస్సార్‌సీపీ నాయకులు అభిమానులు పాల్గొన్నారు.

యంత్ర పరికరాలు సద్వినియోగం చేసుకోండి

వినుకొండ(నూజెండ్ల): వైఎస్సార్ యంత్ర సేవా పథకం ద్వారా అందజేసిన యంత్ర పరికరాలను సద్వినియోగం చేసుకునేలా రైతులను చైతన్యపరచాలని మండల వ్యవసాయ అధికారిణి షేక్ సుగుణాబేగం తెలిపారు. మండల కేంద్రమైన నూజెండ్ల రైతు భరోసా కేంద్రంలో గ్రామ వ్యవసాయ, ఉద్యాన సహాయకులకు బుధవారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యంత్ర సేవా పథకం కింద రైతు భరోసా కేంద్రాలకు ఇచ్చిన పరికరాలు, అద్దెకు ఇచ్చిన వ్యవసాయ పరికరాల వివరాలను కస్టమ్ హైరింగ్ సెంటర్ యాప్ నందు నమోదు చేయాలని తెలిపారు. మండలంలోని అన్ని ఆర్‌బీకేల పరిధిలో 941 మట్టి నమూనాలు సేకరించి సాయిల్ టెస్టింగ్ ల్యాబ్‌కి పంపుతున్నామన్నారు. ఖరీఫ్ సాగుకు మండలంలోని 15 ఆర్‌బీకేల్లో 50 శాతం రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ చేసేందుకు జీలుగ, జనుము, పిల్లిపెసర విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి ఎల్.ఎలీషా, సిబ్బంది పాల్గొన్నారు.

మౌలిక వసతులు ఏర్పాటు చేయాలి

శావల్యాపురం: గ్రామ పంచాయతీల్లో సర్పంచుల ప్రజల భాగస్వామ్యంతో మౌలిక వసతులు కల్పించాలని ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచుల, కార్యదర్శులతో మౌలిక వసతులపై సమావేశం నిర్వహించారు.

పెట్రోలు బంకు ఏర్పాటుకు కలెక్టర్ శ్రీకారం

రెవెన్యూ పరిపుష్టి కోసమే..


భూమిపూజ చేస్తున్న జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, అధికారులు

నరసరావుపేట: జిల్లాలో రెవెన్యూ జనరేషన్ మోడ్‌తో కలెక్టర్ కార్యాలయం ప్రాంగణంలో ఐఓసీఎల్ పెట్రోల్ బంకు ఏర్పాటు చేయడం జరుగుతుందని కలెక్టర్ ఎల్.శివశంకర్ పేర్కొన్నారు. బుధవారం ఉదయం కలెక్టర్ కార్యాలయ ప్రాంగణం వద్ద ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ సంస్థ ఏర్పాటు చేస్తున్న ప్రభుత్వ పెట్రోలు బంకుకు జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.శ్యాంప్రసాదుతో కలిసి భూమిపూజ చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ కలెక్టరేట్ ప్రాంగణంలో కలెక్టర్ ఫిల్లింగ్‌స్టేషన్ నామకరణంతో పెట్రోల్ బంకును ఏర్పాటు చేస్తున్నామని, జిల్లా యంత్రాంగానికి స్వయంగా నిధులు సమకూర్చుకునే విధంగా ఈ పెట్రోల్ బంకును ఏర్పాటు కానుందన్నారు. వచ్చిన రెవెన్యూను జిల్లా అవసరాల కోసం, కలెక్టరేట్, ఆఫీసుల అభివృద్ధి కోసం వినియోగించుకోవడం జరుగుతుందన్నారు. గతంలో తాను జాయింట్ కలెక్టర్‌గా ఉన్నప్పుడు, శ్రీకాకుళం, సీతంపేట వద్ద ఐటీడీఏ ప్రాజెక్టు అధికారిగా ఉన్నప్పుడు సీతంపేటలో పెట్రోల్ బంకును ఏర్పాటుచేసి విజయవంతంగా నిర్వహించామన్నారు. వచ్చిన ఆదాయాన్ని కార్యాలయ అవసరాల కోసం వినియోగించుకోవడం జరిగిందన్నారు. రానున్న రెండు నెలలలో పెట్రోల్ బంక్ అందుబాటులో రానుందని, స్థానిక ప్రజలు, ప్రభుత్వ అధికారులు పెట్రోల్ బంక్ సేవలు సద్వినియోగం చేసుకొని మరింత రెవెన్యూ ఉత్పత్తి అయ్యేలా సహకరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి కె.వినాయకం, రెవెన్యూ డివిజనల్ అధికారి ఎం.శేషిరెడ్డి, మండల రెవెన్యూ అధికారి ఆర్‌వీ రమణానాయక్, డీఆర్‌డీఏ పీడీ బాలునాయక్, ఐఓసీఎల్ కార్పొరేషన్ డివిజనల్ మేనేజర్ అనిల్‌కుమార్, శ్రీరామ్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

మట్టి నమూనాల సేకరణపై సమీక్ష

రొంపిచర్ల: స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో బుధవారం వీఏఏలతో వ్యవసాయ అధికారి విజయభాస్కర్ సమీక్ష నిర్వహించారు. మట్టినమూనాల సేకరణ, పరీక్షలు, రాయితీపై విత్తనాలు తదితర అంశాలపై సమీక్షించారు. మట్టినమూనాల సేకరణపై వివరించారు. అలాగే పచ్చిరొట్ట విత్తనాల సరఫరాపై సమీక్షించారు. పచ్చిరొట్ట ఎరువులను వాడటం వల్ల రసాయనిక ఎరువుల వాడకం తగ్గుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మండలంలోని అన్ని గ్రామాల్లో గల వ్యవసాయ సహాయకులు తదితరులు పాల్గొన్నారు.

అంటువ్యాధుల నమోదు పరిశీలన

నరసరావుపేట: జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ జి.శోభారాణి బుధవారం పట్టణంలోని ప్రైవేట్ హాస్పిటల్స్ సాయి తిరుమల, మదర్ తెరిస్సా, చెరుకూరి హాస్పిటళ్లు అంటువ్యాధులైన మలేరియా, డెంగ్యూ, ట్యూబరుకు లోసిస్, మైక్రో మొలాసిస్, హ్యూమన్ రేబిస్, టైఫాయిడ్, చికెన్ గునియాలు ఐహెచ్‌ఐపీ పోర్టల్‌లో నమోదు కార్యక్రమం, రికార్డుల మెయింటెనెన్స్‌లను పరిశీలించారు. కార్యక్రమంలో డెప్యూటీ డెమో కె. సాంబశివరావు, శ్రీధర్‌రెడ్డి, ఖాజావలి పాల్గొన్నారు.

అక్షరాస్యతే పునాది

శావల్యాపురం: బాలల భవితకు అక్షరాస్యతే పునాది అని సీడీపీవో ముదివర్తి అనురాధ అన్నారు. బుధవారం స్థానిక అంగన్‌వాడీ సెంటరును సందర్శించి జన్ భగీరథ కార్యక్రమంపై చిన్నారుల తల్లిదండ్రులు, గర్భిణులకు అవగాహన సదస్సు నిర్వహించారు. అంగన్‌వాడీ సెంటరు బలోపేతం కావడానికి ప్రజల భాగస్వామ్యం తప్పనిసరిగా ఉండాలన్నారు. సమావేశంలో సూపర్‌వైజరు కుప్పం శ్రీలత, ఆరోగ్య కార్యకర్త ఇంకొల్లు నాగలక్ష్మి, మహిళా పోలీసు గౌసియాబేగం, అంగన్‌వాడీ కార్యకర్తలు గోవిందమ్మ, జాస్సీకారాణి, ఈస్తేరీరాణి, గోపమ్మ, ఆశలు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శ్రీకారం

నరసరావుపేట రూరల్: మండలంలోని పెదరెడ్డిపాలెంలో చేపట్టిన అభివృద్ధి పనులకు బుధవారం ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ప్రారంభోత్సవం నిర్వహించారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఇచ్చిన హామీ మేరకు రూ.14 లక్షల నిధులతో నిర్మించిన సీసీ రోడ్లు, డ్రైయిన్‌లను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ మూరబోయిన శ్రీనివాసరావు, నడికట్టు శ్రీకాంత్‌రెడ్డి, భవనం సుధాకరరెడ్డి, యేరువ శివారెడ్డి పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం

చిలకలూరిపేటటౌన్: రక్తదానం చేయండి.. ప్రాణదాతలు కండి అని చిలకలూరిపేట ఏరియా ఆసుపత్రి వైద్యాధికారి డాక్టర్ కేవీ లక్ష్మీకుమారి చెప్పారు. బుధవారం పట్టణంలోని ఏరియా వైద్యశాలలో ప్రపంచ రక్తదాతల దినోత్సవం నిర్వహించారు. ముందుగా రిబ్బన్ కట్ చేసి రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ శిబిరంలో 23 మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో బ్లడ్ బ్యాంక్ మెడికల్ ఆఫీసర్ ఐ.మునిభవాని, డాక్టర్లు వెంకట్రావు, ప్రశాంతి అమృతవల్లి, సిబ్బంది సేతు, వాసుదేవరావు, హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

గణపవరంలో కుంభాభిషేకం

నాదెండ్ల: గణపవరం గ్రామ పరిధిలోని శివప్రియ నగర్‌లో కొలువైయున్న శ్రీ గండిపోచమ్మ ఆలయ వార్షికోత్సవ వేడుకలు సందర్భంగా బుధవారం అమ్మవారికి చండీయాగ సహిత కుంభాభిషేకం, పూర్ణాహుతి నిర్వహించారు. ఆదిపరాశక్తి క్షేత్ర పీఠాధిపతి నిత్య విద్యానంద భారతీ స్వామి బృందం ఆధ్వర్యంలో ఉదయం 7 గంటలకు గణపతిపూజ, గోపూజ నిర్వహించారు.

ఈఏపీ సెట్‌లో పేట విద్యార్థులకు ర్యాంకులు

చిలకలూరిపేటటౌన్: ప్రకటించిన ఈఏపీసెట్‌లో పట్టణానికి చెందిన పలువురు విద్యార్థులు సత్తాచాటారు. పట్టణంలోని సీఆర్ కాలనీకి చెందిన పోపూరి అనిరుధ్‌కు 115 ర్యాంకు, కోండ్రుపాడుకు చెందిన ఇంటూరి శివ రామ మణికంఠకు 135వ ర్యాంకు సాధించారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులను అభినందించారు.

నీట్‌లో పవన్‌కుమార్‌కు 570 ర్యాంక్



నరసరావుపేట ఈస్ట్: జాతీయస్థాయిలో మెడికల్ కళాశాలల ప్రవేశాలకు నిర్వహించిన నీట్ యూజీ పరీక్షలో పట్టణానికి చెందిన చప్పిల్లి విశ్వసాయిపవన్‌కుమార్ 570 ర్యాంక్ సాధించాడు. మొత్తం 720 మార్కులకు గాను పవన్‌కుమార్ 695 మార్కులు సాధించాడు. జాతీయస్థాయిలో 570 ర్యాంక్, ఓబీసీ కేటగిరిలో జాతీయస్థాయిలో 128 ర్యాంక్ సాధించాడు. గతంలో తెలంగాణ ఎంసెట్‌లో 58వ ర్యాంక్‌తో పాటు ఏపీ ఈఏపీ సెట్‌లో పవన్‌కుమార్ 100వ ర్యాంక్ సాధించాడు. పవన్‌కుమార్ తండ్రి కోటేశ్వరరావు వ్యాయామ ఉపాధ్యాయుని గాను, తల్లి శ్రీలలిత ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు. వైద్యునిగా పేదలకు ఉత్తమ సేవలు అందించటమే తన లక్ష్యమని పవన్‌కుమార్ తెలిపారు.

వినుకొండపై 17న వేలంపాట

వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని కొండపైన వేంచేసిన శ్రీ రామలింగేశ్వర స్వామి వారి తొలి ఏకాదశి తిరునాళ్ల మహోత్సవాన్ని పురస్కరించుకుని కొండపైన కొబ్బరికాయలు, కొబ్బరి చిప్పలు, ప్రసాదములు, వాటర్ బాటిల్స్, కూల్‌డ్రింక్స్ అమ్ముకునేందుకు ఈనెల 17వ తేదీన వేలంపాట నిర్వహించడం జరుగుతుందని కార్యనిర్వాహక అధికారి కె.హనుమంతరావు తెలిపారు. వేలంలో పాల్గొనే వారు ధరావత్తు చెల్లించాలని, ఈ వేలంపాట పట్టణంలోని ప్రసన్న రామలింగేశ్వర, కోదండ రామస్వామి వారి దేవస్థానం ప్రాంగణంలో శనివారం ఉదయం 10 గంటలకు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. వేలంలో పాట దక్కించుకున్న వారు ఈ నెల 29వ తేదీ తిరునాళ్ల రోజు మాత్రమే విక్రయించుకునేందుకు వీలుంటుందని తెలిపారు.

గిరిజన కోఆపరేటివ్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా పాలపర్తి



నరసరావుపేట: ఏపీ గిరిజన కో ఆపరేటివ్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్‌గా పట్టణానికి చెందిన తొమ్మిదవ వార్డు మాజీ కౌన్సిలర్ పాలపర్తి వెంకటేశ్వరావు నియమితులయ్యారు. ఈ మేరకు సోషల్ వెల్ఫేర్ రాష్ట్ర సెక్రటరీ కాంతిలాల్ దండే బుధవారం జీవో నంబరు 198ను విడుదల చేశారు. వెంకటేశ్వరరావు వైఎస్సార్ సీపీ ఏర్పాటు దగ్గర నుంచి పార్టీలో కొనసాగుతూ 2014లో నిర్వహించిన పురపాలక ఎన్నికల్లో 09వ వార్డుకు గిరిజన కౌన్సిలర్‌గా ఎన్నికయ్యారు. ఆ తర్వాత మున్సిపల్ ప్రతిపక్ష నాయకుడిగా వ్యవహరించారు. ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి సహకారం వలనే తనకు డైరెక్టర్ పోస్టు లభించినట్లు వెల్లడించారు. రాష్ట్రంలో గిరిజనుల అభివృద్ధి కోసం తనవంతు సహకారం అందజేస్తానని చెప్పారు. తనను నియమించిన ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే గోపిరెడ్డికి తన కృతజ్ఞతలు తెలియచేశారు. పాలపర్తిని పలువురు అభినందించారు.